## క్లుప్తంగా

### అక్రమ మద్యం స్వాధీనం



**తాడికొండ:** మండల పరిధిలోని ఫణిదరం గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 31 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ సీహెచ్.ప్రభాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో తాడిశెట్టి వెంకటేశ్వర్లు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు సోమవారం ఎస్సై రవీంద్ర బాబు దాడులు నిర్వహించి 31 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. నిందితుడు తాడిశెట్టి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

### ఉర్దూ పాఠశాలల్లో తనిఖీలు



**తాడేపల్లిరూరల్ :** దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల, పెనుమూలి, చిలువూరు గ్రామాల్లోని ఉర్దూ పాఠశాలలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ.ఖాసిం సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా చిలువూరు గ్రామంలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. దుగ్గిరాల మండల పరిధిలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం బాలోత్సవం కార్యక్రమంలో బహుమతులు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

**తాడేపల్లిరూరల్ :** మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం ముగ్గురోడ్డుకు చెందిన బబ్లు అనే యువకుడు ఇంటి వద్ద నుంచి తన ద్విచక్రవాహనంపై ఉండవల్లి సెంటర్‌కు వెళుతుండగా వెనుక నుంచి అతివేగంగా వస్తున్న ఆరు చక్రాల కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బబ్లుకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

### ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

మంగళగిరి సీఐ శ్రీనివాసరావు




**తాడేపల్లిరూరల్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని మంగళగిరి పట్టణ సీఐ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మంగళగిరి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలతో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మరియు డీఎస్పీ రవికాంత్ ఆదేశాల మేరకు సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ కవాతు నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతాల్లో భద్రతా దళాల పహారా పెంచామని చెప్పారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

### పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం

**ఫిరంగిపురం:** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యులు ఫరీనాబేగం అన్నారు. మండలంలోని వేమవరం ఎంపీపీ పాఠశాలలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా సోమవారం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యాధుల నివారణ, పాటించాల్సిన పద్ధతులు గురించి వైద్యురాలు ఫరీనాబేగం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.కమల్ మోహన్, రవిశేషు, రెహమాన్, కీర్తి, విజయ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

# నవరత్నాలతో మహిళల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే
- దుగ్గిరాలలో మహిళలకు చేయూత నమూనా చెక్కు అందజేత



మహిళలకు చేయూత నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే, ఇన్‌చార్జి మురుగుడు లావణ్య

**తాడేపల్లిరూరల్ :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర చేయటం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకొని పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. సోమవారం దుగ్గిరాల మార్కెట్ యార్డులో నాలుగో విడత చేయూత నగదు మంజూరు చెక్కులను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మురుగుడు లావణ్య, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, తహసీల్దార్ రవిబాబు, ఎంపీడీవో భార్గవి, ఏపీఎం సమాధానం తదితరులు హాజరై చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పేదవారి తలరాతలు మార్చడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. దుగ్గిరాల మండల వ్యాప్తంగా నాల్గవ విడతగా రూ.7 కోట్లు అక్కా చెల్లెమ్మలకు అందజేస్తున్నట్లు చెప్పారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఆయన అధికారం చేపట్టిన నాటి నుంచి అక్కా చెల్లెమ్మలకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా రాజ్యాధికారంలో సైతం వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో బీసీ మహిళ అయిన మురుగుడు లావణ్యను అంతా ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు వడ్డేశ్వరపు రజనీకాంత్, సర్పంచ్‌లు బాణావత్ కుషీబాయి, షేక్ అజీజున్, యార్లగడ్డ శ్రీచందన దుర్గా భవాని, ఉన్నం ఝాన్సీరాణి, షేక్ సల్మా, గంపల గంగాధరరావు ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి సురేష్, పెద్దేటి కావ్య, బాణావత్ ద్వాలిభాయ్, షేక్ సల్మా, పార్టీ నాయకులు షేక్ సుభాని, జమ్ముల లోకేష్, పిల్లి ధర్మరత్నం, పలుకూరి శామ్యూల్, యార్లగడ్డ చిన్న, షేక్ జానీ బాషా, పంచాయతీ కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మహిళలు

### మేము ఎంతో సంతోషంగా ఉన్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో మేము ఎంతో సంతోషంగా ఉన్నాం. గతంలో ఏదైనా సంక్షేమ పథకాలు పొందాలంటే రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు వాలంటీర్ మా ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రి పేద ప్రజలకు సహాయం చేయని విధంగా జగనన్న ప్రజల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారు.

– షేక్ వహిద, చిలువూరు

### వ్యాపారానికి ఉపయోగపడుతోంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అందజేస్తున్న వివిధ పథకాలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే మహిళలకు పెట్టుబడి సాయంగా ఉపయోగపడుతున్నాయి. కొంతమంది ముఖ్యమంత్రి వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని ప్రచారం చేస్తున్నారు. వారందరికీ మన జగనన్న ప్రభుత్వంలో అక్కా చెల్లెమ్మలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధిని గురించి వివరిస్తే మళ్లీ అలా మాట్లాడరు.

– రత్నకుమారి, ఈమని

# సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన





జీతాలు చెల్లించాలంటూ పాదయాత్ర నిర్వహిస్తున్న కార్మికులు

**తాడేపల్లిరూరల్ :** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు చెల్లించాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలంటూ సోమవారం బ్రహ్మానందపురం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 1953 మే 29న ఫ్యాక్టరీని యాజమాన్యం మూసి వేసిందని, అప్పటికే కార్మికులకు జీతాలు చెల్లించాల్సి ఉందని అన్నారు. కార్మికులకు జీతాలు చెల్లించాలంటూ హైకోర్టు ఆదేశించినా ఇప్పటి వరకు ఫ్యాక్టరీ యాజమాన్యం జీతాలు చెల్లించలేదని ఫ్యాక్టరీ స్థలాలను కారు చౌకగా పెట్టుబడి దారులకు అమ్మివేస్తున్నారని ఆరోపించారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలుగజేసుకుని కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు, సీపీఎం నాయకులు జొన్న శివశంకరరావు, వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు కంచర్ల కాసయ్య, వివిధ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు తొలి ప్రాధాన్యం



చేయూత నమూనా చెక్కు అందజేస్తున్న దయాసాగర్

**ఫిరంగిపురం:** మహిళాసాధికారతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని మచిలీపట్నం పోర్టు డైరెక్టర్ ఎం.దయాసాగర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద డాక్టర్ వైఎస్సార్ చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకున్నారన్నారు. తాను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తరువాత తాను తెలుసుకున్న సమస్యలకు పరిష్కారాలు చూపారని చెప్పారు. నవరత్నాలు ప్రవేశపెట్టి దాని ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలాగా కృషి చేసినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థను నెలకొల్పి వలంటీర్ల సాయంతో పేదలైన అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేసినట్లు తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తలచి గ్రామ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదలకు పథకాల ద్వారా అండగా నిలిచినట్లు చెప్పారు. అనంతరం చేయూత నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, జి.చంద్రం, యల్లారెడ్డి, పి.చిన్న, వై.శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి, ఖాజావలి, మస్తాన్‌వలి, డి నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

**మేడికొండూరులో ఆసరా చెక్కు పంపిణీ**

**మేడికొండూరు:** సమాజంలో మహిళలకు ప్రత్యేక స్థానం సమకూర్చిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని మచిలీపట్నం పోర్ట్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ అన్నారు. మేడికొండూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మండల ఏపీయం విజయ భారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేకతోటి దయాసాగర్ మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేశారని అన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో ప్రజలకు మెరుగైన ఆధునిక సేవలు అందించడం జరిగిందన్నారు. ఫలితంగా రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, ఫిరంగిపురం మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ ఫాతిమా, మేడికొండూరు, పేరేచర్ల సొసైటీల చైర్మన్‌లు పాములపాటి జయరావు, షేక్ గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల ఆస్తులు కాపాడడం అందరి బాధ్యత

ఎమ్మెల్సీ హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే



మెట్ల మార్గం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే

**తాడేపల్లిరూరల్ :** మంగళగిరిలోని చారిత్రక ప్రాశస్త్యం కలిగిన దేవాలయాలను సందర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారని అలాంటి దేవాలయాల ఆస్తులను పరిరక్షించుకోవడం అందరి బాధ్యతని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మంగళగిరి కొండపై ఉన్న గండాలయ్య స్వామి వారి మెట్ల మార్గం ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీరిద్దరూ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గండాలయ్య స్వామి వారి ఆలయానికి ప్రతి ఆదివారం, అమావాస్య రోజుల్లో మంగళగిరి, పరిసర ప్రాంతాల్లోని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు వెళతారని, మెట్ల మార్గం సరిగా లేకపోవడంతో దాతల సహాయంతో ఈ మెట్ల మార్గాన్ని నిర్మించామని అన్నారు. మంగళగిరి రూరల్ కాజ గ్రామానికి చెందిన సింహాద్రి వెంకటరామిరెడ్డి, వారి కుటుంబ సభ్యులు, దుగ్గిరాల మంచికల పూడిలోని కాంటినెంటల్ ఫ్యాక్టరీ యాజమాన్యం మెట్ల మార్గానికి ఖర్చు చేసిన దాంట్లో సింహభాగం అందజేశారని చెప్పారు. వీరితో పాటు ఎంతో మంది దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించారని అన్నారు. సింహాద్రి వెంకటరామిరెడ్డి దంపతులను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ఉద్యోగాలకు 142 మంది విద్యార్థుల ఎంపిక

**తెనాలి:** బెంగళూరులోని ఐఎల్‌ఎం సంస్థ జరిపిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు 142 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. కాలేజీలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐఎల్‌ఎం సంస్థ గత 22 ఏళ్లుగా తమ కాలేజీలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్టు గుర్తుచేశారు. కాలేజీపై గల నమ్మకమే ఇందుకు కారణమన్నారు.

### కోదండ రామాలయంలో నవగ్రహ హోమం

**ఫిరంగిపురం:** మండలంలోని రేపూడి గ్రామంలోని కోదండ రామాలయంలో సోమవారం స్వామికి విశేష పూజలు చేశారు. ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. మండపారాధన, విశ్వక్సేన పూజ, నవగ్రహ పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో నవగ్రహ, విఘ్నేశ్వర, సుదర్శన హోమాలను రుత్వికులు గోపి వేదాంతం, నారాయణం, భరద్వాజ్, వినయ్, రాంబాబు, డి.కృష్ణమూర్తిలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### మహిళలు ఉన్నతంగా ఎదగాలి

**మేడికొండూరు:** మండల కేంద్రమైన మేడికొండూరులో సోమవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు ఏపీఎం విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. విజయభారతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సమాజంలో గౌరవ స్థానంలో నిలబడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యానిమేటర్లు పాల్గొన్నారు.

### వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవీ కాలం పెంపు

**తాడికొండ:** తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా పని చేసిన ముక్కామల గ్రామానికి చెందిన చిమటా పూర్ణచంద్రరావు, పాలకవర్గ సభ్యుల పదవీ కాలాన్ని 6 నెలలు పొడిగిస్తూ అగ్రికల్చరల్ మార్కెటింగ్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత జీవో ప్రకారం 12–01–2024తో వీరి పదవీ కాలం ముగిసింది. ఇదే పాలకవర్గాన్ని 6 నెలల పాటు పొడిగిస్తూ సోమవారం అగ్రికల్చరల్ మార్కెటింగ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది.


### మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**తెనాలి రూరల్:** నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు అరెస్టు చేశారు. కొల్లిపరలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏ.వి.చలం, సిబ్బంది సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 10 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. తెనాలి రైల్వే స్టేషన్ ఐదో ప్లాట్‌ఫారం వైపు నుంచి అమరావతి ప్లాట్స్‌కు నిబంధనలకు విరుద్ధంగా మద్యం సీసాల్ని తీసుకెళుతున్న వ్యక్తిని త్రీ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### నేడు పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం

**తెనాలి టౌన్:** రూరల్ మండలం నందివెలుగులోని ఇమ్మానుయేలు ప్రార్థనా గోపురం చర్చిలో మంగళవారం ఉదయం 11 గంటలకు రూరల్ మండల పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పాస్టర్ బర్నబాసు సోమవారం తెలిపారు. మండల పాస్టర్స్ నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. మండలంలోని పాస్టర్లు, దైవజనులు సమావేశంలో పాల్గొనాలని పాస్టర్ బర్నబాస్ కోరారు.

### బాధిత రైతులకు న్యాయం చేస్తాం



రైతులు, సీపీఎం నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే

**తాడేపల్లిరూరల్ :** దుగ్గిరాల గ్రామ పరిధిలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదం వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. సోమవారం దుగ్గిరాల మండలంలో పర్యటిస్తున్న సమయంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే, ఎథిక్స్ కమిటీ చైర్మన్ మురుగుడు హనుమంతరావును ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు జెట్టి బాలరాజు ఆధ్వర్యంలో బాధితులు కలిశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంపై ఇప్పటికే విచారణ చేపట్టామని త్వరలోనే నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మండలం రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు యోగేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు, భీమవరపు అమ్మిరెడ్డి, చంద్రశేఖరరావు, బసవయ్య, నాగేశ్వరరెడ్డి, శివయ్య, పోతురాజు పాల్గొన్నారు.

# ఆంగ్ల భాష ఉచ్ఛారణతో ఆరోగ్యానికి మేలు

కేఎల్‌యూ ప్రో చాన్సలర్ డాక్టర్ జగన్నాథరావు



'ది ఎసెన్స్ అండ్ మ్యాట్రిక్స్ ఆఫ్ లిటరేచర్ అండ్ లాంగ్వేజ్' పుస్తకాన్ని విడుదల చేస్తున్న అతిథులు

**తాడేపల్లి రూరల్ :** ఆంగ్లభాష పలికే విధానం వలన మనిషి మెదడు పనితీరు మెరుగు పడుతుందని కేఎల్‌యూ ప్రో చాన్సలర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూ ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి రెండు రోజుల ఆంగ్ల భాషా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాష అనేది బ్రెయిన్ యాక్టివిటీ అని, ఆంగ్ల భాష అన్ని పాఠ్యాంశాలకు కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. ఆంగ్ల భాష విభాగాధిపతి డాక్టర్ కేవీ దివ్య మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరుగుతున్న అంతర్జాతీయ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, భాషా పరిశోధకులు అధిక సంఖ్యలో హాజరయ్యారని అన్నారు. ఆంగ్లభాషపై భాషా శాస్త్రవేత్తలు జరిపిన వివిధ రకాల పరిశోధనా పత్రాలు ప్రచురణ జరిగినట్లు తెలిపారు. సుమారు 100 మంది పరిశోధనా పండితులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారని వివరించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ కేకే. సునాలిని మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దాదాపు 200 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. బ్రిడ్జింగ్ ది గ్యాప్స్, ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ లిటరేచర్ అండ్ లాంగ్వేజ్ స్టడీస్ పుస్తకాలతో పాటు డాక్టర్ సునాలిని, డాక్టర్ కేబీ గ్లోరీలు సరిచేసి ముద్రించిన పుస్తకాలు, డాక్టర్ ఎస్ ఫర్హాద్ సరిచేసి ముద్రించిన ది ఎసెన్స్ అండ్ మ్యాట్రిక్స్ ఆఫ్ లిటరేచర్ అండ్ లాంగ్వేజ్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముంబైకు చెందిన ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ దినేష్‌కుమార్ నాయర్ 'ఓషియానిక్ నేరేటివ్స్ బ్లూ హ్యూమానిటీస్ అండ్ నాటికల్ ఫిక్షన్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్ వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, కో ఆర్డినేటర్ డాక్టర్ శివగంగ ప్రసాద్, జోధ్‌పూర్‌కు చెందిన జై నారాయణ వ్యాస్, యూనివర్శిటీ ఆచార్యులు, డీన్ డాక్టర్ కల్పనా పురోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే హాజరు



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే

**తాడేపల్లిరూరల్ :** మంగళగిరి పట్టణ పరిధిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఉమ్మడిగా ప్రణాళిక రూపొందించి మరో అధునాతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. సోమవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి , ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు సుమారు రూ.50 కోట్ల వ్యయంతో ఆరు అత్యాధునిక విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించామని వివరించారు. గౌతమ బుద్ధ రోడ్డులో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 7వ అత్యాధునిక ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టినట్లు తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యుత్ శాఖా మాత్యులు, ఉన్నతాధికారులు సహాయ సహకారాలు అందించారని ఇందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సుమారు రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆధునిక విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం వలన పట్టణంలో చాలా వరకు విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. నిర్మాణం శరవేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు ఆయన తెలిపారు.

# పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సాయం



పూర్వ విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

**తాడికొండ:** పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న సాయం అభినందనీయమని తుళ్లూరు కేవీఆర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుత్తా శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలకు బెంచీలు బహూకరించిన 1994–95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు వర్రె కిరణ్‌కుమార్, జమ్ముల సతీష్, అమర్తి ఉమా మహేశ్వరరావు, యంపరాల నరసింహారావు, తుళ్లూరుకు చెందిన వ్యాపార వేత్త పులిపాటి శ్రీనివాస్‌లను సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు మూలమైన పాఠశాలను మరిచి పోకుండా తమవంతు సాయంగా పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి సేవ చేయడం ఎందరికో మార్గదర్శకమని పేర్కొన్నారు. పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలకు సిద్ధమవుతున్న తరుణంలో పూర్వ విద్యార్థులతో పాఠశాలలో సమావేశం త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. పూర్వ విద్యార్థులంతా స్వర్ణోత్సవ వేడుకలకు హాజరై మాతృ సంస్థ రుణం తీర్చుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

సాదరంగా ఆహ్వానించిన వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి లావణ్య



సద్దాం హుస్సేన్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఇన్‌చార్జి లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల

**తాడేపల్లిరూరల్ :** మంగళగిరి పట్టణ పరిధిలోని టీడీపీ మైనార్టీ నేత సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో పలువురు ముస్లిం సోదరులు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు సద్దాం హుస్సేన్‌తో పాటు తన అనుచరులకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. రాబోయే కాలంలో మంగళగిరి కోటపై మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని ఆమె అన్నారు.

# వడ్డీ వ్యాపారుల ఒత్తిడికి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**మేడికొండూరు :** మేడికొండూరుకు చెందిన వేముల శరత్‌కుమార్ వడ్డీ వ్యాపారుల ఒత్తిడికి మానసికంగా కృంగిపోయి సోమవారం ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు శరత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కూరగాయల వ్యాపారం చేసుకునేందుకు కాల్‌మనీ వ్యాపారుడు చైతన్య వద్ద నుంచి రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు, అసలు కలిపి రూ.10 లక్షలు చెల్లించాడు. కాలమనీ వ్యాపారి చైతన్య, అతని సోదరి న్యాయవాది అనురాధ, ఆమె భర్త కలిసి బాధితుడు శరత్‌కుమార్ తల్లిదండ్రులను పిలిచి మీ అబ్బాయి ఇంకా రూ.10 లక్షలు చెల్లించాలని బెదిరింపులకు గురిచేశారు. శరత్‌కుమార్ సోదరుడి స్థలాన్ని కాలమనీ వ్యాపారుడు చైతన్య పేరున రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ స్థలంపై రూ.7 లక్షల లోను తీసుకున్నారు. దీంతో మానసికంగా కృంగిపోయిన శరత్‌కుమార్ పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి చికిత్సనిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు పాల్పడే ముందు తనకు, తన కుటుంబానికి జరిగిననష్టాన్ని సెల్ఫీ వీడియోద్వారా తెలిపి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. దీనిపై తమకు సమాచారం అందాల్సి ఉందని పోలీసులు తెలిపారు.